www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 26 మే 2025 | 5 | కాకినాడ



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో 26 వ తేదీన సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి రాలేనప్పుడు వారి యొక్క Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల నమోదు, వాటి స్థితిపై 1100కు నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

వర్షాలతో మామిడి రైతు కుదేలు

- కోత దశ వచ్చేసరికి వర్షాలు
- పురుగు పట్టి రాలిపోతున్న కాయలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మెట్ట ప్రాంత మామిడి రైతులు కుదేలయ్యారు. ఈ ఏడాది దిగబడి బాగానే ఉన్నా అకాల వర్షాలు వారిని నిండా ముంచాయి. వేలకు వేలు పెట్టుబడి పెట్టిన రైతులకు పంట చేతికి వచ్చే సమయానికి చేజారిపోయింది. పక్వానికి వచ్చిన పండ్లు కళ్లెదుటే రాలిపోతున్నాయి. మెట్ట ప్రాంతంగా పిలవబడే జగ్గంపేట మండలంలోని జె.కొత్తూరు, రాజపూడి, సీతారామపురం, కృష్ణాపురం, వెంగయ్యమ్మపురం, గోవిందపురం, మల్లిశాల గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ ఏడాది తోటలు బాగానే ఉన్నాయి. దిగబడి బాగానే వస్తుంది అనుకున్నారు రైతులు. సరిగ్గా కాయలు పక్వానికి వచ్చి కోతకు వచ్చే సమయానికి వర్షాలు పడ్డాయి. దీంతో బంగినపల్లి తదితర రకాలకు పురుగులు పట్టి పక్వానికి వచ్చిన కాయలు రాలిపోతున్నాయి. దానికి తోడు ధర కూడా పడిపోయింది. గతేడాది పూత మాడిపోయి దిగుబడి తగ్గితే, ఈ ఏడాది దిగుబడి ఉన్నా కాయలు అమ్ముకోవడానికి లేదు. ఒక వేళ అమ్మడానికి తీసుకెళ్లినా ధరలేదు. గతేడాది కేజీ రూ.12 ఉంటే ఈ ఏడాది రూ.5 నుంచి రూ.6 మాత్రమే పలికింది. గతేడాది పంట లేక నష్టపోతే ఈ ఏడాది పంట ఉండి నష్టపోతాయామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ముందుగానే పంటలను తీసేశారు

మామిడి రైతులు ఈ ఏడాది ముందుగానే ఉన్నారు. వాతావరణం ఎలా ఉంటుందోనని ముందుగానే ఆలోచించి కాయలు లేతగా ఉండగానే కోసేశారు. ఇప్పటికే చాలా వరకు దిగుబడి పూర్తయింది. కలక్టర్ వంటి రకాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ వర్షాలు రైతులకు 10 నుంచి 20 శాతం నష్టాన్ని కలిగించాయి. కాయలు ముందుగా కోయకుండా ఉంటే మరింత నష్టం వచ్చేది.

- ప్రబంధ్, విహెచ్ఎ, గోవిందపురం.



తోటలో మామిడి కాయలు కోస్తున్న రైతు



ధర లేక పూర్తిగా నష్టపోయాం

మల్లిసాల పరిసర ప్రాంతాల్లో 30 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. రూ.15 లక్షల వరకూ పెట్టుబడి పెట్టాం. కాయలు కోతకు వచ్చే సమయానికి వర్షాలు పడ్డాయి. వర్షాలకు పండు ఈగలు వచ్చి కాయలపై వాలడంతో బంగినపల్లి, కలెక్టర్ వంటి రకాలకు పురుగులు పడుతున్నాయి. ఈ పురుగులతో పక్వానికి వచ్చిన కాయలు రాలిపోతున్నాయి. దీంతో అలా దిగుబడిని నష్టపోతే, ధరలేక మరికొంత నష్టపోయాం. గతేడాది కేజీ రూ.12 నుంచి రూ.18 వరకూ ధర పలికింది. ఈ ఏడాది కేజీ రూ.5 నుంచి రూ.6 మాత్రమే పలుకుతోంది. స్థానికంగా ఉండే తాండ్ర తయారీ పరిశ్రమల వారు ప్రతి ఏడాదీ కాయలను కొనేవారు, ఈ ఏడాది వాళ్లు కొనడం మానేశారు. దీంతో ఉన్న పంటలు ఏమి చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాం.

- కర్రి స్వామి, కౌలు రైతు, మల్లిశాల.



స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజా ఉద్యమాలే అమరులకు నిజమైన నివాళి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
నీలపల్లిలో తొలితరం కమ్యూనిస్టులకు స్తూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాళ్లరేవు

సమ సమాజ స్థాపనకు ప్రజా ఉద్యమాలు చేయడమే తొలితరం కమ్యూనిస్టులకు నిజమైన నివాళి అర్పించడమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. తాళ్లరేవు మండలం నీలపల్లి సిద్ధార్థ నగర్‌లో నీలపల్లి గ్రామ తొలితరం కమ్యూనిస్టుల స్మారక స్తూపాన్ని శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్క రించారు. తొలుత సిపిఎం జెండాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో వివిఎస్ఆర్ మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరులకు రక్షణగా నిలబడి, తాళ్లరేవు మండల ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించిన తొలితరం కమ్యూనిస్టు నాయకులు కమిడి వెంకటనారాయణ, మాతా వేమనాచార్యులు, దడాల మహాలక్ష్మి, మేడిశెట్టి నీలాద్రి, అనంతర కాలంలో కమిడి సుధాకర్ పోలీ సుల నిర్బంధాలను తట్టుకుని వీరోచితంగా పోరా డారన్నారు. వారి సేవలు చిరస్మ రణీయమన్నారు. ఈ ప్రాంతంలో రెండవ తరంలో ప్రజా ఉద్యమాలు నిర్మించి ప్రముఖ వైద్యునిగా స్థిరపడిన చెక్కా సింహాచలం ఆర్థిక సహకారంతో ఈ స్థూపాన్ని నిర్మించినట్లు సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు చెక్కా సింహాచలం మాట్లాడుతూ ఆనాటి రోజుల్లో గ్రామాల్లో అగ్రకుల అధిపత్యాన్ని కమ్యూనిస్టుల ప్రభావంతో యువత ప్రశ్నించడంతో ఆదిపత్యం తగ్గిందన్నారు. అయినా మళ్లీ చాప కింద నీరులా అగ్రకులాధిపత్యం కొనసాగుతుందని తెలిపారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. కమ్యూనిజం, అంబేద్కరిజంను కాపాడుకోవాల్సిన అవసరం ఆవశ్యమన్నారు. ఈ స్తూపం పనులు సీనియర్ జర్నలిస్ట్ పొనుగుమట్ల అశోక్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు మోర్త రాజశేఖర్ పూర్తి చేశారని సిపిఎం మండల కార్యదర్శి కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా తొలి తరం కమ్యూనిస్టులు దడాల మహాలక్ష్మి వారసులు దడాల ఆంజనేయులు, మాత వేమణాచార్యులు వారసులు నాగభూషణంలను రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. సభలో కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, డి.శేషబాబ్జి, పలివెల వీరబాబు, సిహెచ్.రమణి, మండల నాయకులు వల్లు రాజబాబు, దుప్పి అదష్టదీపుడు, వెంకటలక్ష్మి, నేరేడుమిల్లి త్రిమూర్తులు, పాలెపు ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కూరాకుల సింహాచలం, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వి.ఏడుకొండలు, ఉప సర్పంచ్ వస్కారెడ్డి, గ్రామ పెద్ద మోకా మధుబాబు, ప్రజా సంఘాల నాయకులు విప్పర్తి శ్రీనివాస్, కమిడి ఈశ్వరి బాయి, పోతుల రత్నకుమారి, వ్యవసాయ శాఖ విశ్రాంతి జెడి పి.సూర్యనారాయణ రాజు, ఉపాధ్యాయులు చెక్కా త్రిమూర్తులు, కాశి రవీంద్ర, త్రిమూర్తులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో సమైక్యతా దినోత్సవం

ప్రజాశక్తి-పిఠాపురం

సిపిఎం రాష్ట్ర కమిటీ కాశ్మీర్ రాష్ట్రంలో పహల్గాంలో 27 మంది ప్రజలను ఉగ్రవాదులు చంపిన సంఘటనలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు తెలియజేయాలని ఇచ్చిన సమైక్యతా దినోత్సవం పిలుపులో భాగంగా స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో మండల కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎంజిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ కాశ్మీర్‌లో పహల్గాంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులు చేస్తారని తెలిసీ అక్కడ భద్రతా సిబ్బందిని పెట్టకపోవడంతో ఉగ్రదాడిలో టూరిస్టుల ప్రాణాలు కోల్పోయారన్నారు. మన దేశంపై ఉగ్రవాదులు దాడులు చేస్తే తగిన గుణపాఠం చెప్పేందుకు తీసుకునే కేంద్ర ప్రభుత్వ చర్యలకు సిపిఎం మద్దతు తెలియజేసిందన్నారు. దేశానికి రక్షణగా నిలిచే ఆర్మీలో జాయిన్ అయ్యే సిబ్బందిని అగ్నివీర్ పేరుతో నాలుగేళ్ల కాల పరిమితి విధించడం సరైనది కాదన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ ప్రజల శ్రేయస్సు పరమావధిగా భావించిన సైనికులు నాలుగేళ్ల తర్వాత మీరు వెళ్లిపోవాల్సిందే అనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. భారత్, పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొనప్పుడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరు దేశాలతో మాట్లాడి ఒత్తిడి తెచ్చి మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తానే చేశాను అన్నట్టు మాట్లాడడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆపరేషన్ సింధూర్ నిర్వహణలో కీలక భూమిక పోషించిన వారికి, పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ కె.చిన్న, కోనేటి రాజు, నాగేశ్వరరావు, జి.వీరబాబు, కె.మణి, విశ్వనాథం, మణికంఠ, రాజేష్, రమేష్, సూర్యనారాయణ, శ్రీను, ఈశ్వరరావు అప్పారావు, డి.సత్యనారాయణ, జి.నాగ చక్రం, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి

మరిడమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం


జూన్ 25వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు 37 రోజులపాటు జరిగే పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర పోస్టర్‌ను పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక సుధా కాలనీలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మరిడమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, మొయిళ్ల కృష్ణమూర్తి, నూనె రామారావు, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, జల్దాని సుబ్రహ్మణ్యం, కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, ఆలయ ఆసాదులు రాయి నాని, ఆలయ సిబ్బంది రమణ పాల్గొన్నారు.

తీర్థ ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని కోలంక, ఆర్యవటం గ్రామాల్లో ఉన్నకోల పిల్లమ్మ, పోలేరమ్మ తీర్థ మహోత్సవాలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శనివారం చిన్న జాతర పూర్తి చేయగా ఆదివారం రాత్రి పెద్ద జాతర ఏర్పాటు చేసి అనంతరం సోమవారం ఉదయం గ్రామ ఆడపడుచులు ఆలయ వద్ద మొక్కులు అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కార్టూ'నిజం'



సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పేర్కొన్నారు. మండలంలో రాచపల్లి, పోదురుపాక గ్రామాల్లో గిరిబాబు ఆదివారం పర్యటించారు. గ్రామంలో ఉన్న వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులను గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభం తేవాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని కూటమి ప్రభుత్వం చేసే మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిశెట్టి నాని, వైస్ ఎంపిపి బంకు శ్రీను, దళే చిట్టిబాబు, సారిపల్లి గంగరాజు, చందక నాని తదితరులు పాల్గొన్నారు.



స్లాబ్‌లు లేని డ్రైనేజీ

ప్రమాదాలకు నిలయాలు.. డ్రెయినేజీలు

ప్రజాశక్తి - జగ్గంపేట

హైవే డ్రైనేజీలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండల కేంద్రమైన జగ్గంపేట సర్వీస్ రోడ్డు ఇరువైపులా హైవే డ్రైనేజీలు ఉన్నాయి. ఆ డ్రైనేజీల స్లాబ్‌లు అనేక చోట్ల విరిగిపోయాయి. అలా విరిగిన మూతలను ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్ వేయాల్సి ఉంది. కానీ ఆ కాంట్రాక్టర్ వేయకపోవడంతో నడిచివెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే హైవే అధికారులు స్పందించి డ్రైనేజీలపై మూతలు వేయాలని తీసుకోవాలని కోరుతున్నారు.

29న గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఈ నెల 29న గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. నగర పంచాయతీ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. వర్షాల కారణంగా రోడ్లు లేనిచోట బురదమయం అయ్యాయి. మున్సిపల్ కార్యాలయం నిర్మాణం, పట్టణంలో అక్రమ లేఔట్లు పారిశుధ్యం, తాగునీరు వీధిలైట్లు వంటి అనేక సమస్యలపై ప్రజలు తీవ్ర నిరాశగా ఉన్నారు. ఈసారైనా కౌన్సిల్ సమావేశంలో పైసమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు అధికారులు చొరవచూపుతారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

నేడు యోగా శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక పాసిల వారి వీధిలోని వెలమ కమ్యూనిటీ హాలులో యోగా శిబిరం సోమవారం ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యోగా శిబిరం జూన్ 21వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఎంపిడిఒ డి.శ్రీలలిత మాట్లాడుతూ ఆదివారం యోగాపై వర్చువల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

కాశ్మీర్‌కు రాజ్యాంగ హక్కులు అమలు చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

భారత యూనియన్‌లో విలీనం సందర్భంగా కాశ్మీర్‌కు కల్పించిన రాజ్యాంగ హక్కులు అమలు చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పేర్కొన్నారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కాకినాడ యుటిఎఫ్ హోమ్‌లో నిర్వహించిన కాశ్మీర్ పూర్వాపరాలు - ప్రస్తుత సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో అజశర్మ ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలో జరిగిన ప్రజా ఉద్యమం ద్వారా కాశ్మీర్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందన్నారు. ఆ సందర్భంలో రాజ్యాంగం 370 అధికరణం, 35ఎ చేర్చబడ్డాయన్నారు. 75 ఏళ్ళుగా కేంద్ర పాలకులు ఎవరున్నా, కాశ్మీర్ లో రాజ్యాంగ హక్కులు సక్రమంగా అమలు చేయలేదన్నారు. తాజాగా కాశ్మీర్‌లో భూములు కార్పొరేట్‌లు కాజేసే అవకాశం దక్కిందన్నారు. దీనివల్ల నిరుద్యోగం పెరిగి ఇతర సమస్యలు పెరగడానికి కారణమవుతుందన్నారు. ఉగ్రదాడి సందర్భంగా కాశ్మీర్ ప్రజలంతా దేశంవైపే ఐక్యంగా నిలబడ్డారని కొనియాడారు. ఉగ్రవాదం, మతోన్మాదం మానవాళికి ప్రమాదకరమన్నారు. ప్రజలంతా మతసామరస్యం కోసం నిలబడి దేశసమైక్యత సమగ్రత కాపాడుకోవాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఆర్‌విఎన్.స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు ఆహ్వానం పలుకగా, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవి.సాయిరాం వందన సమర్పణ చేశారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మతో పాటు పలువురు ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎ. అజశర్మ

పూర్వ విద్యార్థుల సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-కాకినాడ

రెడ్ కాన్వెంట్ పూర్వ స్టూడెంట్స్ సేవలు అభినందనీయమని కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వర రావు అన్నారు. రెడ్ కాన్వెంట్ లేకపోయినా ఆనాడు విద్యను అభ్యసించిన విద్యార్థులంతా కలిసి ఒక ట్రస్ట్‌గా ఏర్పడి విద్యా, వైద్య, ఉపాధి వంటి రంగాలకు ఉచిత సేవలు, సహాయం చేయడం పట్ల వనమాడి సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఒక వికలాంగునికి ట్రై సైకిల్, స్వయం ఉపాధి పథకంలో భాగంగా నలుగురు మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురు విద్యార్థులకు సైకిళ్లను ఎంఎల్ఎ కొండబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు కాకినాడ, పరిసర ప్రాంత ప్రజలకు అందిస్తున్న సేవలు మరువలేనివని, వీరిని స్ఫూర్తిగా తీసుకోని సేవలను ఇంకా విస్తృత పరచాలని ఎంఎల్ఎ వనమాడి ఆకాంక్షించారు. ఈ సేవలను కాకినాడ ప్రజలు, ప్రభుత్వం గుర్తుంచుకుంటారన్నారు. వీరి సేవలు విస్తృత పరిచే విధంగా కాకినాడలో ఒక స్థలాన్ని ప్రభుత్వం తరుపున అందించేందుకు సహకరిస్తామని ఎంఎల్ఎ చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకష్ణ మాట్లాడారు. డివిఆర్ జగన్నాథం. ఎస్.పాపారావు, తాళ్లూరి శ్రీనివాస రాజు, వేదుల మధు, టి.పద్మనాభం, వివి.రామ్‌చరణ్, కుమార్, ఎం.జనార్ధన్, టి.సత్య శ్రీనివాసరావు, ఆకుల సరళ పాల్గొన్నారు.



పరికరాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంఎల్ఎ కొండబాబు

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -కరప

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మహిళల ఆర్థిక అభివద్ధికి కషి చేస్తున్నారని రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ పేర్కొన్నారు. ఆదివారం గొర్రిపూడిలోని ఎపి వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ సహకారంతో కైకాలబత్తుల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రారంభించారు. గత ప్రభుత్వంలోని పంట కాలువను పట్టించుకోకపోవడం వల్ల కాలవలు పుడుకపోయి రైతుల ఇబ్బందులు గురవుతున్నారు. రూ.20 లక్షల నిధులతో పుడికతీతల పనులు కొబ్బరికాయ కొట్టి ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు చేసుకున్న వారికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కూడిన సభ్యత్వం పత్రాలను నమోదు చేసుకున్న కార్యకర్తలకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉచితంగా ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ అందించి మహిళలు ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభు త్వం కృషి చేస్తోందని, డిగ్రీలు చదివి ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు రూ.లక్షలు వెచ్చించే ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా శిక్షణ అందించి శిక్షణ పొందిన వారికి సర్టి ఫికెట్లు అంది స్తోం దన్నారు. ఈ శిక్షణలో 78 శాతం హాజరై ఉండి శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మరో శిక్షణ కేంద్రాన్ని కరపలో ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా పూడికతీత పనులు చేయించడంతో పొలాలు ముంపు బారిన పడకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా చేసినట్టు ఎంఎల్ఎ నానాజీ తెలిపారు. పుణ్యమంతుల గంగ సత్యనారాయణ, జనసేన నాయకులు పుణ్యమంతుల అన్నవరం, అనుకూల రాంబాబు, ఎర్రమనేడి సత్యనారాయణ, గండి వెంకటేశ్వరరావు, గండి సూర్య చంద్రశేఖర్, జోకా అప్పలరాజు, భోగిరెడ్డి కొండబాబు, నల్లే ప్రశాంత్ కుమార్, ఎంపిడిఒ ఎం.అనుపమ పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

నేడు రఘుపతి వెంకటరత్నం వర్ధంతి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రముఖ సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటలకు జెఎన్‌టియుకె సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పింస్తామని ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు, అభ్యుదయ భావాలు కలిగిన వారు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కాకినాడ పిఆర్ కళాశాలలో ఆయన ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో తొలిసారిగా బాలికలకు ప్రవేశం కల్పించిన ఘనత ఆయనది అని తెలిపారు. కుల మత లింగ వివక్షలకు వ్యతిరేకంగా వెంకటరత్నం కలం, గళం విప్పారని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు ఐ.ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ మన పాలకులు ఆశిస్తున్న 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్, వికసిత భారత్ లక్ష్యం సాధించాలంటే మహిళల భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం అని గ్రహించాలన్నారు. ఇది ఆనాడే ఊహించి మహిళల అభివృద్ధికి పునాదులు వేసిన ఘనత వెంకటరత్నం నాయుడిది అని తెలిపారు.



నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

19వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు చేపట్టిన నిరవేదిక సమ్మె ఆదివారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పెద్దాపురం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో కార్మికులు నిరసన తెలుపుతూ తమ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నా తమకు వేతనాల పెంచడం లేదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని, తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు, సంఘ సభ్యులు బాసిన భద్రరావు, సుంకర సత్తిరాజు, వాకాడ భాస్కరరావు, ఎస్‌కె బషీర్, శివకోటి సాయి, మల్లిపెద్ది భద్రరావు, అయ్యప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి, ఐకమత్యాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుంచి బాలల్లో దేశభక్తి, సోదర భావం, ఐక్యమత్యం పెంపొందించాలని చిల్డ్రన్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో భారతీయులందరూ ఒక్కటే అనే భావజాలాన్ని పెంపొందించాలన్నారు. శాస్త్రీయ ఆలోచన విధానంపై ప్రాథమిక అవగాహన పెంచాలన్నారు. యుటిఎఫ్ పట్టణ కార్యదర్శి బేబీ రత్నం వేమన పద్యాలను రాగయుక్తంగా ఆలపించి, వాటి భావాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు దారపురెడ్డి కృష్ణ దేశభక్తి గీతాలను ఆలపించి వాటిపై అవగాహన కల్పించి విద్యార్థులు తో పాడించారు. సందీప్ విద్యార్థులకు పలు రకాల నత్యాలపై శిక్షణ ఇచ్చారు. అంజలి, అనూష, జశ్విత కోలాటంలో శిక్షణ ఇచ్చారు. కరాటే, వ్యాయామంలో తెప్పల యోగేష్, లోకేష్ శిక్షణ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

వంతాడ మైనింగ్ రోడ్‌లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వంతాడ లేటరైట్ క్వారీలో లారీలు కొండపై నుంచి కిందకు మట్టిని తరలించే క్రమంలో శనివారం రాత్రి రెండు లారీలు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ప్రమాదంలో లారీ క్యాబిన్లో ఇరుక్కుని బీహార్‌కు చెందిన ధీరజ్, చందన్ మృతి చెందారు. వీరిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చనిపోయిన వారి బంధువులు బీహార్‌లో ఉండడంతో మైనింగ్ యాజమాన్యం కానీ, అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవడం లేదు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తనిఖీల్లో పాత నేరస్తుని అరెస్టు

ప్రజాశక్తి-తుని

తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణంలో ఆదివారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో యానాంకు చెందిన కొల్లు ఏసుబాబుపై సుమారు 8 పాత కేసులు ఉన్నట్టు ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తేలింది. దీంతో అతడిపై బైండోవర్ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యా కమిటీ చైర్మన్ ఆత్మహత్య

ప్రజాశక్తి- కరప

కాజులూరు మండలం గొల్లపాలెం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొలిశెట్టి సత్యం (40) శనివారం రాత్రి గొర్రెపూడి డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్య పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.జ కాజులూరు మండలం గొల్లపాలెంలో బిర్యానీ సెంటర్ నిర్వహించే కొలిశెట్టి సత్యం గొల్లపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి గొర్రిపూడి డ్రైన్‌లోకి ఆయన దూకి ఆత్మహత్యకు పాల్పడారడు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలించడగా ఆదివారం సాయంత్రం మృతదేహం లభ్యమయ్యింది. పోస్మార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మరిడమ్మకు బంగారు నత్తు సమర్పణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి తుని గ్రామానికి చెందిన బర్ల కృష్ణగంగరాజు, మాధవీలత దంపతులు ఆదివారం రూ.3,80,000 విలువైన బంగారు నత్తును అందజేశారు. వీరు ఈ నత్తును ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మికి అందజేశారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అంజూరి రాంబాబుకు సత్కారం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

వైసిపి జిల్లా కార్యదర్శిగా ఇటీవల పట్టణానికి చెందిన అంజూరి రాంబాబు నియమితులు కావడంతో ఆదివారం ఆయనను పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ పలువురు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా పద్మశాలీలకు వైసిపి గుర్తింపు ఇచ్చిందని రాంబాబు అన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిచెర్ల మధుబాబు పంపన సూర్యనారాయణ, సూరిశెట్టి సూరిబాబు, మొండి లోవరాజు, సత్తిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతులకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వంతాడ మైనింగ్ యాజమాన్యం నిర్లక్ష్యంతో మృతి చెందిన బీహార్ యువకులకు రూ.25 లక్షల పరిహారం వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దువ్వా శేష బాబ్జీ డిమాండ్ చేశారు. మైనింగ్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం భారీగా వర్షం కురిసినప్పటికీ లారీలు కిందకి దిగడంతోనే ప్రమాదం జరిగిందని అధికారి యంత్రం పూర్తిగా వైఫల్యం చెందడంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. మైనింగ్ యాజమాన్యం ఏ పార్టీ అధికారంలో ఉన్న వాళ్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా దోచుకు తింటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ యాజమాన్యాలకు ప్రజాప్రతినిధులు వత్తాసు పలకడంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్న ప్పటికీ సామాన్య ప్రజలు నోరు మెదపడం లేదన్నారు. తక్షణమే బాధ్యత కుటుంబాలకు న్యాయం చేయకపోతే ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

27న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ వైద్య కళాశాలలు-ప్రైవేటీకరణ అనే అంశంపై ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు కాకినాడ యుటిఎఫ్ టీచర్స్ హోమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రజారోగ్య వేదిక నగర కన్వీనర్ పి. శ్రీనివాస్ ఒక ప్రకటన లో తెలిపారు. ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలే ప్రైవేటీకరణ చేస్తే సామాన్యులకు వైద్యం ఏవిధంగా అందుబాటులో ఉంటుందో ఆలోచించాలన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వ వైద్య, ఆరోగ్య రంగాలు బలోపేతం కావాలని కోరుకునే వారు పాల్గొనాలని కోరుతున్నామని శ్రీనివాస్ ఆ ప్రకటనలో తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక సివి రామన్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను ఆదివారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నాయకులు చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, వంటేద్దు వెంకన్నాయుడు, సివి రామన్ స్కూల్ కరస్పాండెంట్ రవణం వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయ వంతెనకు ముప్పు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రసిద్ధి చెందిన సామర్లకోట శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే గోదావరి కాలువపై నిర్మించిన నూతన ప్రధాన వంతెనను ఇటీవల ఒక హెవీ వెహికల్ ఢీకొని ప్రధాన రైలింగ్ దెబ్బతింది. పాత బ్రిడ్జి పూర్తిగా శిథిలం కావడంతో పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హోమ్ మంత్రి హోదాలో ఉండగా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, నిర్మాణం పూర్తి చేయించారు. ఇటీవల సాగర్ మాల రహదారుల నిర్మాణం నేపథ్యంలో భారీ బరువు లోడింగ్‌తో కూడిన మెటీరియల్ టిప్పర్లు ఈ బ్రిడ్జి పైనుంచి భీమేశ్వర ఆలయం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. కేవలం ఆలయానికి వచ్చే వాహనాలు, కాల్వ వెంబడి ఉన్న రైతుల ప్రయోజనార్థం నిర్మించిన ఈ బ్రిడ్జిపై నిత్యం వందలాది మోతాదుకు మించిన బరువుతో టిప్పర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల ఒక డ్రైవర్ నిర్లక్ష్యంగా బ్రిడ్జి మొదటి భాగాన్ని ఢీకొట్టి వెళ్ళిపోయాడు. ఈ బ్రిడ్జ్‌పై నిర్ణీత సామర్థ్యాన్ని మించి భారీ లోడ్ వెహికల్స్ ప్రయాణించడం వల్ల, బ్రిడ్జ్ మాత్రమే కాకుండా రైతులు నిర్మించుకున్న పక్క రహదారులు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగర్ మాల రోడ్డు నిర్మాణ పనుల కోసం అధిక బరువున్న వాహనాలు తరచూ ఈ మార్గాన్ని వినియోగిస్తున్నాయి. దీనివల్ల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని దష్టిలో ఉంచుకుని, దేవాదాయశాఖ అధికారులు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, రైతుసంఘం ప్రతినిధులు కలిసి పరిశీలించి, హైకెపాసిటీ వెహికల్స్ రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


గోదావరి కాల్వపై ఉన్న ఆలయ బ్రిడ్జిని ఢీకొట్టగా దెబ్బతిన్న రైలింగ్

'సినీ పరిశ్రమ వివాదాల్లోకి నన్ను లాగొద్దు'

ప్రజాశక్తి-కాకినాడ

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదల కాకుండా తనతోపాటు కొంతమంది సినీ నిర్మాతలు కుట్ర పన్నారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్లు బంద్ చేయాలన్న ప్రతిపాదన సినీ పరిశ్రమ, థియేటర్ యజమానులు, ఎగ్జిబిటర్లకు సంబంధించిన అంతర్గత వ్యవహారమని ద్వారంపూడి పేర్కొన్నారు. ఆ అంశంతో తనకు ఎలాంటి సంబంధమూ లేదని ఆయన చెప్పారు. పూర్తిగా సినీ పరిశ్రమకు సంబంధించిన ఈ వ్యవహారంలో నిర్మాతల మండలి ప్రతినిధి నట్టి కుమార్ చేసిన వ్యాఖ్యలను ఏమాత్రం ధవీకరించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు అనవసరంగా తన పేరును వాడి వివాదం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ వివాదంలో తన పాత్ర పై ఏమైనా ఆధారాలు ఉంటే చూపించి విమర్శలు చేయాలని ఆయన హితవు పలికారు. నిజ నిర్ధారణ చేసుకోకుండా సినీ పరిశ్రమ వివాదంలోకి తనను లాగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇటీవలి కాలంలో సినీ పరిశ్రమకు చెందిన ఏ ఒక్కరినీ తాను కలవలేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఉన్నాననే అక్కస్సుతో ఏదో ఒక వివాదంలోకి లాగి తప్పుడు విమర్శలు చేయడం, అబద్ధాన్ని నిజం చేసేలా పదేపదే ప్రసారం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్దాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్దామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.రవికుమార్ అన్నారు. జూన్ 5న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మూడవ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సిఎం హాజరవుతారని తెలిఆపరు. జిల్లా నుంచి ఉద్యోగులు అధిక సంఖ్యలో విచ్చేసి సభను జయప్రదం చేయాలని కోరారు. ఎన్నడూ లేని విధంగా గత ఐదారేళ్లుగా ఉద్యోగులకు సంబంధించిన వివిధ బకాయిలు పేరుకుపోయాయన్నారు. వీటిని వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పాక్షికంగానే చెల్లింపులు జరిగాయన్నారు. పూర్తి స్థాయిలో వీటిని చెల్లించాలన్నారు. పెండింగ్ డిఎలతో పాటూ పిఆర్‌సి వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. వైద్య రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో ఉన్న ఆసుపత్రుల్లో అవుట్ పేషెంట్ రోగుల సంఖ్య ఇన్ పేషెంట్ రోగుల సంఖ్య పెరిగిన కారణంగా కేడర్ స్ట్రెంగ్త్ మార్చి ఉద్యోగుల సంఖ్య పెంచాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో జిల్లా ఆసుపత్రులుగా ఉన్న ఐదు ఆసుపత్రులను మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రులుగా మార్చారన్నారు. ఈ సందర్భంలో జోనల్ కేడర్‌గా ఉన్న రేడియో గ్రాఫర్ల సంఖ్య ఏమాత్రం పెరగలేదన్నారు. రాజమండ్రిలో కేవలం ముగ్గురు రేడియోగ్రాఫర్లు ఓల్డ్ పాటర్న్‌లో ఉన్నారన్నారు. రెండు పోస్టులు ఖాళీ ఉండగా ఒక రేడియోగ్రాఫర్ మాత్రమే ఉన్నాడని తెలిపారు.ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి 24 గంటలు షిఫ్ట్ డ్యూటీల కోసం 10 మంది రేడియోగ్రాఫర్లు అవసరమన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ సామాన్య ఆసుపత్రుల్లో వెంటనే రేడియోగ్రాఫర్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు.

సత్తిబాబు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - మండపేట

పట్టణంలోని 15వ వార్డుకి చెందిన టిడిపి కార్యకర్త కొమ్మిశెట్టి సత్తిబాబు ఇటీవల ఒక ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో టిడిపి సభ్యత్వ బీమా సొమ్ము రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అందజేశారు. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ చంద్రు శ్రీవరప్రకాష్, మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, పట్టణ అధ్యక్షులు మత్సా నాగబాబు, 15వ వార్డు కౌన్సిలర్ గ్రంధి వీరవెంకట శ్రీనివాస్, టిడిపి అధ్యక్షులు పాలచర్ల వెంకన్నబాబు, గున్న శ్రీను, శిరంగి ఈశ్వరరావు, కాశీన కాశీవిశ్వనాథం, ఎం.సూర్యప్రకాష్, వాదా ప్రసాదరావు, అల్లూరి రామకృష్ణచౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీమా చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

టెన్త్ టాపర్‌కి రూ.10 వేల ప్రోత్సాహం

ప్రజాశక్తి - మామిడికుదురు

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన మొగలికుదురుకు చెందిన కొల్లాబత్తుల మహాలక్ష్మికి మాజీ ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్ చేతుల మీదుగా రూ.10 వేలు ఇచ్చి ప్రోత్సహించారు. ఆదివారం గొందిలో కొల్లాబత్తుల శీను ఇంటివద్ద కొల్లాబత్తుల కింగ్స్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహాలక్ష్మికి మాజీ ఎంఎల్ఎ రాపాక చేతుల మీదుగా రూ.10 వేలతోపాటు, మెమోంటో ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొల్లా బత్తుల కింగ్స్ సోదరులు అశోక్ కుమార్, శ్యామ్‌బాబు, విజయ్‌కుమార్, శ్రీను, నాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు


మహాలక్ష్మికి నగదు ప్రోత్సాహం అందిస్తున్న మాజీ ఎంఎల్ఎ రాపాక

గుంతలమయంగా ప్రక్కిలంక-నరసాపురం రోడ్డు

ప్రజాశక్తి - పెరవలి

ప్రక్కిలంక- నరసాపురం మెయిన్ రోడ్డు గోతలతో శిథిలమైంది. భారీ వాహనాలు రద్దీ పెరగడం, వర్షాల కారణంగా భారీ గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణికులు, వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వేసవి సీజన్ ప్రారంభం నుంచి నియోజకవర్గంలో ఇసుక ర్యాంపులు నుంచి అధిక ఇసుక లోడు లారీలు, మెటల్‌ను తరలించే లారీలు ఈ రహదారి గుండానే ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డు కుంగిపోయి గుంతలు ఏర్పడుతున్నాయి. కానూరు -ఊసులుమర్రు గ్రామాల మధ్య రోడ్డు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా రోడ్డును మాత్రం నేటికీ వేయలేదు. రెండు కిలోమీటర్ల పొడవున రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ఏది రోడ్డో, ఏది గుంతో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. పలువురు వాహనదారులు ఈ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వంలో రోడ్డు వేసిన ఏడాదికే కుంగి పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంది. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరుపక్కల పంట కాలువ, మురుగు కాలువలు ఉన్నాయి. మరోపక్క మెయిన్ కెనాల్ ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మంత్రి దుర్గేష్, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.


పెద్ద గుంతలో అధ్వానంగా ఉన్న రోడ్డు

శునకాలు స్వైర విహారం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గుమ్మళ్ళదొడ్డిలో శునకాల స్వైర విహారంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. నిత్యం కుక్కల దాడిలో పాడి పశువులు, చిన్నారులు గాయాల బారిన పడుతున్నారు.. ఇటీవల కాలంలో ఇంటి వద్ద కూర్చున్న ఒక మహిళపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పంచాయతీ కార్యాలయం ఎదురుగానే ఈ ఘటన జరిగినప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించలేదు. శనివారం కుక్కల దాడిలో ఆవు దూడ చనిపోగా, మరో రెండు ఆవులకు గాయాలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎస్పి డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎయిర్ పోర్ట్, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, లాడ్జిలు, జనసంచార ప్రదేశాల్లో ఈ తనిఖీలు జరిగాయి. అనుమానితులను ప్రశ్నించారు. ఎవరైనా అపరిచితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కాకినాడలో నేడు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి-కాకినాడ

ఎపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు మెగా యోగా కార్యక్రమం నిర్వహిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం రామారావుపేట ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ రోడ్డులో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో నూకాలమ్మ గుడి సెంటర్ నుంచి మూడు లైట్ల జంక్షన్ మీదుగా సిబిఎం స్కూల్ నుంచి పాత బస్టాండ్ వైపునకు ట్రాఫిక్ మళ్లిస్తామని తెలిపారు. ప్రజలు దీన్ని గమనించి మున్సిపల్, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించి ప్రభుత్వం చేస్తున్న ఈ బహత్ కార్యక్రమానికి ప్రజలందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి సహకరించాలని కోరారు. తమ ఆరోగ్య రక్షణ కోసం చేపడుతున్న ఈ యోగా కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ భావన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఉత్కంఠ భరితంగా ఈత పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

బాలబాలికల ఈత పోటీల జట్టు ఎంపిక సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఈత పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. జూన్ నుంచి పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కాలేజీలో 11వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల కోసం ఆదివారం సామర్లకోట దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్లో ఈ పోటీలు నిర్వహించరాఉ. ఉత్తమ ప్రతిభ కనబరిచి బాలుర విభాగంలో కె.ధనంజయ, కె.ముత్యాల ముఖేష్, కె.నాగకృష్ణ, పిఎస్‌సి ప్రభాకర్, పి.సాయి ధనుష్ రాజ్, ఆర్.వెంకటేష్, కె.దొరస్వామి, ఎల్.రాకేష్, బాలికల విభాగంలో ఎ.షణ్ముఖశ్రీ సాయి, పికెవిపి సహస్రశ్రీ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి సతీష్, ఇనుసుమల్ల రాజు, మంగా వెంకట శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్

ప్రజాశక్తి-కాజులూరు

ప్రమాదాలను నివారించిందుకే డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని కోలంక శివారులో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇటీవల చోరీలు జరుగుతున్నాయని, నెంబర్ లేని వాహనాలను, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని రికార్డులు సరిగా లేని వారిపై దృష్టి సారించామన్నారు. ఈ తనిఖీల్లోమూడు కేసులు నమోదు చేసి సోమవారం కోర్టుకు పంపించనున్నట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది తిరుపతి నాయుడు, శేషు కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు పూడ్చివేత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చేపల చెరువులలో అక్రమంగా కోడి వ్యర్థాలను కలుపుతూ ప్రజల జీవితాలతో ఆడుకుంటున్న వారిపై ఏలేశ్వరం పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర రావు తెలిపిన వివరాలివి. మండలంలోని చేపల చెరువులోకి వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలు తరలించి కలుపుతున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించగా తిరుమాలి వద్ద ఒక వాహనాన్ని పట్టుకున్నట్టు తెలిపారు. వ్యాన్‌లో ఉన్న చికెన్ వ్యర్థాలను గొయ్యి తవ్వి పాతిపెట్టామనాన్రు. వాహనం డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వైస్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొంటారన్నారు. సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.


కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగ్గయ్య చెరువు కాలనీలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-పిఠాపురం

స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో సిఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు సిబ్బందితో కలిసి కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఆ ప్రాంతంలో పూర్తిగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనలు తనిఖీలు చేసి సరైన పత్రాలు లేని సుమారు 43 బైకులను సీజ్ చేశామని, 15 లీటర్ల నాటు సారా సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపించిన, ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంటి యజమానులు కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెకిచ్చేటప్పుడు వారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు మణికుమార్, జాన్ బాషా, రామకృష్ణ, వెంకటేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెందుర్తిలో అక్రమంగా గ్రావెల్ తరలింపు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నాయి. పుష్కర కాలవ గట్టు నుంచి యథేచ్ఛగా గ్రావెల్‌ను తవ్వి లేఔట్లలో ఫిల్లింగ్ చేస్తున్నారు ఈ అక్రమ దందా రాత్రులు జరుగుతోందని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌టిఆర్ కాలనీలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలో అనుమానిత గృహాల్లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు సక్రమంగా బైకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నేటి నుంచి యోగాంధ్ర-2025

ప్రజాశక్తి- సామర్లకోట

జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సోమవారం నుండి యోగా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు గాంధీబొమ్మ సెంటర్ వద్ద యోగా శిక్షణ తరగతులు జూన్ 21 వరకు ప్రతిరోజూ ఉదయం నిర్వహిస్తారన్నారు. సామాజిక ఆరోగ్యం, శారీరక దఢత్వం కోసం ప్రజలు స్వచ్ఛందంగా ఈ యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం సుదూర ప్రాంతాల నుండి అమ్మవారిని దర్శించుకునేందుకు యాత్రికులు వస్తుంటారన్నారు. దాతల సహాయ సహకారాలతో వీరందరికీ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఆలయ ఆసాదులు రాయి నాని, రామచంద్రప్రసాద్, వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆలయ సిబ్బంది రమణ, వరహాలు, శివ తదితరులు సహాయ సహకారాలు అందించారు.


డ్రాయింగ్ పోటీల్లో విజేతలు

వేసవి శిబిరంలో డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు తాటిగడప సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, కథలు చెప్పడంలో అవగాహన కల్పించారు. నీతి శతక పద్యాలను భావాత్మకంగా ఆలకించి వాటి సారాంశంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు బి.అరవింద్, ఎం.రామారావు, పి.రాజేష్ పాల్గొన్నారు.


పాము శ్రీనివాస్ ను అభినందిస్తున్న సభ్యులు

ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి-కాకినాడ

ఎపి ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పాము శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు కాకినాడలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆదివారం విజయవాడలోనే ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ హోమ్‌లో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో అధ్యక్షునిగా పాము శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా దేవిశెట్టి రమణారెడ్డి, సహాధ్యక్షునిగా డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బి.సుజాత, జి.జగదీష్, టి.ఉదయ భాస్కరరావు, పి.హరిబాబు, పివిఎల్.వరకుమార్, టిఆర్ఎస్ మురళీధర్ నాయుడు, జె.రవికుమార్, కార్యదర్శులుగా కె.మమత, ఎస్.దివ్యభారతి, ఎ.శ్రీనివాసరావు, బి.అక్కేశ్వరరావు, పి.విశ్వనాథ్, కరుణాకర్, ఎంకె.రఘునందన్, కె.కాశీ విశ్వనాథ్, కోశాధికారిగా బొత్స శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షేమం లేకుండా పేదరిక నిర్మూలన ఎలా?

ప్రజాశక్తి - అమలాపురం

సంక్షేమ పథకాలను అమలు చేయకుండా రాష్ట్రంలో పేదరికాన్ని ఎలా నిర్మూలిస్తారని వైసిపి నాయకులు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారని, అయితే అధికారంలోకి వచ్చాక ఆ పథకాలను పక్కన పెట్టారని విమర్శించారు. ప్రతిరోజు సూపర్ సిక్స్ పథకాల కోసం పేద ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాలు ఇవ్వకుండా పేదరిక నిర్మూలన ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

ఈ నెల 26వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగు తుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చున్నారు. ఏవైనా సందేహాలు ఉంటే అడగ వచ్చునని, కొత్త ఫిర్యాదులు నమోదు చేయవచ్చునన్నారు ప్రజల సౌలభ్యం కోసం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లు, 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాలలో పిజిఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున అర్జీదారులు ఆయా స్థాయిలలో తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియచేయవచ్చునని తెలిపారు.